క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడికి సత్కారం



ఖాదర్‌ను సత్కరించిన ముస్లిం నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ మక్కా, మదీనా పుణ్యక్షేత్రాల సందర్శనల్లో భాగంగా ఉమ్రా యాత్రకు వెళ్తుండడంతో ముస్లిం నాయకులు ఆదివారం సత్కరించారు. కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహమాన్ ఖాన్, ఆ జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషాతోపాటు అమలాపురం ముస్లిం నాయకులు ఖ్వాజాబాబు, ఎండీ బషీర్, అబ్బాస్, జహిరుద్దీన్, జాఫర్, హాజీ, ఫైరోజ్ తదితరులు షేక్ అబ్దుల్ ఖాదర్‌ను స్థానిక శ్రీరామపురంలో సత్కరించారు. అలాగే స్థానిక ముల్లా ముస్తాఫా మసీదులో ఉమ్రా యాత్రకు వెళ్తున్న ఖాదర్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శెట్టిబలిజ వన సమారాధన బ్రోచర్ల ఆవిష్కరణ



వన సమారాధన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం రూరల్: వచ్చే నెల 24న అమలాపురం కొంకాపల్లి సత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగే కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధనకు సంబంధించిన బ్రోచర్లను ఎమ్మెల్సీ కుడిపూడి సూర్య నారాయణరావు, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, సంఘ పెద్దలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంఘ నాయకులు వన సమారాధనను విజయవంతం చేయాలన్నారు. శెట్టిబలిజ సంఘ నాయకులు కుడుపూడి త్రినాథ్, పెచ్చెట్టి చంద్రమౌళి, రాయుడు సత్యరుషి, మట్టపర్తి మురళీకృష్ణ, కుడుపూడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


చెకుముకి పరీక్షల్లో ప్రతిభ



పరీక్షల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను ప్రశంసిస్తున్న సభ్యులు

అల్లవరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మలికిపురంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పరీక్షల్లో ఓడలరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి ఆదివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 39 పాఠశాలలకు చెందిన విద్యార్థులు చెకుముకి పరీక్షలకు హాజరు కాగా ఓడలరేవు ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పెద్దింటి లక్ష్మీగాయత్రి, పొనమండ జాహ్నవి, మల్లాడి కనకరాజు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందించి అభినందించారు. ఉపాధ్యాయులు బొక్కా శివకుమార్, వెంకటేశ్వరరావు, సీఆర్పీ వెంకట్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ముమ్మిడివరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్మికులు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరిగింది. కార్మికుల సంఖ్య పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు సమకూర్చాలని, వాహన మరమ్మతులు చేయించాలని, సెలవులు, జీఓ నంబర్ 36 అమలు, ఎస్ఎంఆర్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎం.భార్గవ్‌రాజు, మాణిక్యం, కొండయ్య, బి.లక్ష్మణ్, పి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీ కరక్కాయిపేటలో ప్రగతి నారీ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మావతి అధ్యక్షతన రూరల్ మండల కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర ఇన్‌చార్జి నాగమణి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాడతామని అన్నారు. నవంబర్ 1 నుంచి 5 వరకూ జరిగే రాష్ట్ర రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రూరల్ మండల అధ్యక్షురాలిగా సీహెచ్ విజయలక్ష్మి, కార్యదర్శిగా జిత్తుగా వెంకటలక్ష్మి, కమిటీ సభ్యులుగా టి.లక్ష్మి, ఎస్.నాగమణి దేవి, ఎస్.లక్ష్మి, టి.విజయలక్ష్మి, జి.స్వప్న, కె.సీతారత్నం, జి.కృష్ణవేణి, టి.విజయలక్ష్మి ఎన్నికయ్యారు.

భౌ భౌ బూచి..

- ఎక్కడ చూసినా శునకాలే
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- కుక్కకాట్లతో ఆందోళన



అమలాపురం నల్ల వంతెన వద్ద కుక్కల స్వైర విహారం

అమలాపురం టౌన్: గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి.. జనానికి భయాందోళన కలిగిస్తున్నాయి.. బయటకు వస్తే ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళనకు గురిచేస్తున్నాయి.. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి. రెండు నియోజకవర్గాల్లో 134 గ్రామాలతో పాటు అమలాపురం పట్టణం, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. మున్సిపాలిటీ, నగర పంచాయతీ, గ్రామ పంచాయతీల అధికారులు కుక్కల అదుపునకు తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉండడంతో అవి జనావాసాల మధ్య, పలు కూడళ్లలో చెలరేగిపోతున్నాయి. ఆయా చోట్ల మొత్తం దాదాపు 8,500 కుక్కలు ఉన్నట్లు అంచనా. ముఖ్యంగా అమలాపురంలో కుక్కలు భౌ భౌ అంటూ కనిపించగానే జనానికి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత అనుభవాలను తలచుకుని భయపడిపోతున్నారు. ఇటీవలే పట్టణంలో ఓ పిచ్చికుక్క చెలరేగిపోయి 25 మందిని తీవ్రంగా గాయపరిచింది. మూడేళ్లతో పోల్చుకుంటే పిచ్చికుక్కల స్వైర విహారం ఘటనలు పట్టణంలో ఐదు సార్లు చోటు చేసుకున్నాయి. ఇది కాకుండా ఇక్కడి 30 వార్డుల్లో ఏదో వీధిలో వీధి కుక్కల కాట్లకు ప్రజలు గురవుతూనే ఉన్నారు. **కుక్క కాట్లకు వైద్యం అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రితోపాటు రెండు నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీల్లో అందుతున్నా కొంతమంది కుక్క కాటు బాధితులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. పట్టణంలోని నల్ల, ఎర్ర వంతెనలు, ఈదరపల్లి వంతెన కూడళ్లలోనే కాకుండా పలు వీధుల్లో** కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

పట్టణంలో ఆందోళనకరం

ఐదేళ్ల కిందట పశు గణనలో పట్టణంలో దాదాపు 1200 కుక్కలు ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ప్రకటించారు. ఇప్పుడు పట్టణంలో పశుగణన జరుగుతోంది. ఈ సంఖ్య మరింత పెరగనుంది. కోర్టులు, పలు స్వచ్ఛంద సంస్థల ఆంక్షలతో కుక్కలను చంపేందుకు మున్సిపాలిటీలు, పంచాయతీలు ససేమిరా అంటున్నాయి. దీంతో కుక్కల్లో సంతాన ఉత్పత్తి పెరగకుండా వాటికి శస్త్ర చికిత్సలు చేయిస్తూ కుక్కల సాంద్రత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉదాహరణకు అమలాపురం పట్టణంలో 150 కుక్కలకు సంతాన ఉత్పత్తి పెరగకుండా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించింది. మరో 465 కుక్కలకు కు.ని శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఇప్పుడు పట్టణంలో దాదాపు 2 వేల కుక్కలు ఉన్నట్లు అనధికార అంచనా. పెంపుడు కుక్కతో ఆరేళ్ల కిందట స్థానిక నల్ల వంతెన సమీపంలో ఓ బాలుడు పంట కాల్వలో పడి మృతి చెందిన ఘటనతో నాటి నుంచి పట్టణంలో వీధి కుక్కలకే కాదు పెంపుడు కుక్కలంటే హడలెత్తిపోతున్నారు. కొంత మంది తమ పెంపుడు కుక్కలను సాయంత్రం వేళ వాకింగ్‌తోపాటు కాలకృత్యాల కోసం బయటకు తీసుకుని వచ్చి తిప్పుతున్నప్పుడు కూడా ప్రజల్లో కంగారు పుడుతోంది. అసలే పందులు, రోడ్లపై ఆవులు, ఇళ్లలో దోమలతో పట్టణ ప్రజలు నిత్యం అవస్థలు పడుతుంటే కుక్కల బెడద కూడా బూచిలా భయపెడుతోంది.



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన పాడి గేదె

త్వరలోనే నియంత్రిస్తాం

పట్టణంలో కుక్కల నియంత్రణకు ఓ కార్యచరణ తయారు చేస్తున్నాం. త్వరలోనే వాటి అదుపునకు పూర్తి స్థాయి చర్యలు చేపడతాం. ఇప్పటికే పట్టణంలోని కొన్ని కుక్కలకు సంతాన ఉత్పత్తి పెరగకుండా ఆపరేషన్లు చేయించాం. మరికొన్ని కుక్కలకు కూడా త్వరలోనే చేయిస్తాం. దీనికి సంబంధించి ఓ కొత్త ఏజెన్సీ రాబోతుంది.

–రాజు, మున్సిపల్ కమిషనర్, అమలాపురం

పాడి గేదెలపై పిచ్చికుక్క దాడి

అల్లవరం: కొమరగిరిపట్నంలో గేదెలపై పిచ్చికుక్క దాడి చేసింది. ఆదివారం మధ్యాహ్నం మాకాంలో ఉన్న ఐదు గేదెలను, ఒక ఆవును కరిచింది. పాడి రైతులకు అనుమానం వచ్చి పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పశు సంవర్ధక అసిస్టెంట్ వినయ్‌సాగర్ ఘటనా స్థలానికి చేరుకుని కుక్క కరిచినట్లు ధ్రువీకరించి ఆరు గేదెలకు వ్యాక్సిన్ వేశారని డాక్టర్ నారాయణరావు తెలిపారు.

రేపు కంటి వైద్య శిబిరం

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులచే స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. ఈ విషయాన్ని ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు తెలిపారు. ఉచిత కంటి పరీక్షలతోపాటు శస్త్రచికిత్సలకు అవసరమైన రోగులకు ఉచిత రవాణా, భోజన సదుపాయాలు ఏర్పాటుతో వేమగిరిలోని కంటి ఆస్పత్రికి తీసుకుని వెళ్తారన్నారు. ఇతర వివరాలకు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్‌ను 98493 40904 నంబరులో సంప్రదించాలన్నారు.

రమణయ్య విగ్రహావిష్కరణ

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెం గ్రామంలోని బీవీఆర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య విగ్రహాన్ని మాజీ సర్పంచ్ నక్కా నాగేంద్రుడు ఆదివారం ఆవిష్కరించారు. సర్పంచ్ నల్లా వెంకటేశ్వరరావు, పెయ్యిల శ్రీనివాసరావు, ముత్తాబత్తుల వజ్రం, ఉప సర్పంచ్ కొల్లు చిన్నారి, వార్డు సభ్యులు గుత్తాల దుర్గ, పినిపే నాగేశ్వరరావు, కొల్లు వెంకట్రావు, మెండి రాజేష్, కొల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

తాళ్లరేవు: అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించిన స్వాములకు సుంకరపాలెంలో నిర్వహిస్తున్న భిక్షకు జార్జిపేటకు చెందిన కర్రిోటి ఓంకార్ స్వామి 17 బస్తాల బియ్యాన్ని అందజేశారు. సుంకరపాలెంలోని శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయం వద్ద 54 రోజుల పాటు ఈ భిక్ష చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓంకార్‌స్వామి 442 కిలోల బియ్యాన్ని ఇచ్చారు. దాతను ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించారు.

పన్ను బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



షాపుల అద్దె బకాయిలను క్షేత్ర స్థాయికి వెళ్లి వసూలు చేస్తున్న ఆర్వో శ్రీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్)లో అద్దె బకాయిలు పేరుకుపోయిన 15 షాపుల వద్దకు రెవెన్యూ అధికారి (ఆర్వో) భూపతి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్ర స్థాయికి ఆదివారం వెళ్లి వసూళ్లు చేశారు. ఒక్క రోజులోనే రూ.4.45 లక్షలు వసూలు చేశారు. ఐదు షాపులకు తాళాలు వేశారు. కొంతమంది బకాయిదారులు రెవెన్యూ అధికారులు దుకాణాల వద్దకు వెళ్లగానే బకాయి అద్దెలు చెల్లిస్తే.. మరికొంత మంది నాలుగు రోజులు సమయం కోరారు. ఏడు షాపుల లీజుదారులు తక్షణమే బకాయిలు అక్కడికక్కడే చెల్లించారు. ఈ 15 మంది దుకాణ లీజుదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో తామే రంగంలోకి దిగి నేరుగా దుకాణాల వద్దకు చర్యలు చేపట్టామని ఆర్వో శ్రీలక్ష్మి తెలిపారు. బకాయి వసూళ్లకు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నూరు శాతం లక్ష్యానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో ఇంటి, ఖాళీ స్థలాల, కుళాయి పన్నులు, షాపుల అద్దెల బకాయిలను తక్షణమే చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ రాజు విజ్ఞప్తి చేశారు.

రీజెన్సీ పునః ప్రారంభానికి సహకారం



సీఎం రంగసామిని కలసిన రీజెన్సీ సంస్థల చైర్మన్ జీఎన్ నాయుడు

యానాం: యానాం నియోజకవర్గంలో వివిధ కారణాలతో మూతపడిన రీజెన్సీ టైల్స్ పరిశ్రమ పునః ప్రారంభించేలా పూర్తి సహకారం అందిస్తానని పుదుచ్చేరి సీఎం రంగసామి రీజెన్సీ సంస్థల ఎండీ డాక్టర్ జీఎన్ నాయుడికి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా నాయుడు కలసి సత్కరించారు. 12 ఏళ్ల పాటు మూతపడిన రీజెన్సీ టైల్స్ పరిశ్రమను పునః ప్రారంభించడానికి సంస్థ సుమారు రూ.25 కోట్ల మేర పెట్టుబడి పెడితే, కంపెనీకి సంబంధించి సహజ వాయువు సరఫరా తదితరంగా ఉన్న అడ్డంకులను పరిష్కరించాలని సీఎం రంగసామి దృష్టికి నాయుడు తీసుకువెళ్లారు. రీజెన్సీ పరిశ్రమకు సంబంధించి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని రంగసామి హామీ ఇచ్చారు. మేనేజింగ్ డైరెక్టర్ నరాల సత్యేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ



ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రొఫెసర్ గోకరకొండ సాయిబాబా విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలు, ప్రశ్నించే తత్వంతోనే ఆ స్థాయికి ఎదిగారని కవి, కోనసీమ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (కోకోఫెడ్) అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో సాయిబాబా పూర్వపు మిత్రులు, అభిమానులు, బంధు మిత్రులతో ఆదివారం జరిగిన సంస్మరణ సభకు బలరామమూర్తి అధ్యక్షత వహించి ప్రసంగించారు. రాష్ట్ర ఆహార కమిషన్ మాజీ సభ్యుడు నాగాబత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో చదివినప్పుడు ఆయనలోని అభ్యుదయ భావాల గురించి సమకాలికులు చెబుతున్నప్పుడు ఉప్పొంగిపోయానని చెప్పారు. తాడికోన మాజీ సర్పంచ్ దాసరి అప్పలస్వామి మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా, తాను కలసి చదువుకున్నామని గుర్తు చేశారు. కవి బీవీవీ సత్యనారాయణ ప్రొఫెసర్ సాయిబాబాపై రచించిన ×ఈ పాపం ఎవరిది...?¶ అనే కవితను సభలో చదివి వినిపించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ల అన్నపూర్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి ఆకుమర్తి రవికుమార్, సర్పంచ్ గోకరకొండ వాసు, న్యాయవాది ఇక్బాల్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తదితరులు ప్రసంగించారు.

మద్యం షాపు తొలగించాలని ధర్నా



మద్యం షాపు తొలగించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: కొత్తపేట మండలం అవిడి రేవు వద్ద ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం కలెక్టరేట్ ఎదుట మహిళలు ధర్నా చేపట్టారు. అవిడి రేవులోని లేఅవుట్‌లో మూడు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటామని చెప్పి, తమ ఇళ్ల వద్ద బ్రాందీ షాపు పెట్టి దారులు మూసివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రాత్రుళ్లు తమ ఇళ్ల సర్వీస్ వైర్లు కట్ చేసి విద్యుత్ నిలిపివేస్తున్నారని అన్నారు. కొత్త ఇళ్లు నిర్మించుకుంటే వారి అనుచరులతో అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. అక్కడి నుంచి వెళ్లగొట్టాలని తమపై కక్ష కట్టి హరిప్రియ అనే గృహిణిపై వెంకట సూర్యనారాయణ, ధనప్రసాద్‌లు దాడి చేశారన్నారు. బ్రాంది షాపు తొలగిస్తామని అధికారులు హామీలు ఇస్తున్నా, ఇంతవరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా ఈ నెల 16న షాపును ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు టి.నాగవరలక్ష్మి, కుసుమ హరిప్రియ, జిల్లేళ్ల హేమలత, బొక్కా శాంతకుమారి, కుసుమ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలను ప్రోత్సహించాలి



గౌతమీ నదీ తీరాన పుస్తకావిష్కరణలో కవులు



సాహితీ పురస్కారాలు అందుకున్న వాడ్రేవు చినవీరభద్రుడు, మురళీకృష్ణ



కవి బీవీవీని సత్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు, రచయితలు

యానాం: తమ రచనల ద్వారా సామాజిక మార్పునకు కృషి చేస్తున్న సాహితీవేత్తలు, కవులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక గీతా మందిరంలో బోయి విజయభారతి ప్రాంగణం, సుమనశ్రీ వేదికపై కవిసంధ్య స్వర్ణోత్సవ సభ, శిఖామణి సాహిత్య పురస్కారాలు, కవిసంధ్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, కవి సమ్మేళనం కార్యక్రమాలు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ కవిసంధ్య ద్వారా ఇచ్చే పురస్కారాల నగదును రెట్టింపు చేస్తున్నట్లు, దానిని తానే ఇస్తానని స్పష్టం చేశారు. శిఖామణి జీవన సాఫల్య పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వాడ్రేవు చినవీరభద్రుడికి కృష్ణారావు అందజేశారు. యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారం విజయనగరానికి చెందిన తెలుగు అధ్యాపకుడు పాయల మురళీకృష్ణకు ఇచ్చారు. శిఖామణి మళయాళ కవిత్వం, కవిసంధ్య మొదటి, 50వ సంచిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రముఖ కవులు విల్సన్‌రావు, రాంకుమార్, పొనుగుమట్ల విష్ణుమూర్తి, ఈశ్వరరెడ్డి, రత్నరాజు, నరసింహరాజు, జానకి రామచౌదరి, రమణ, రామరాజు, పెద్దిరాజు, రామశాస్త్రికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను అందించారు. సాహిత్య అకాడమీ సలహా మండలి కన్వీనర్, న్యూఢిల్లీ డాక్టర్ సి.మృణాళిని, బొల్లోజు బాబా, దాట్ల దేవదానంరాజు, మధునాపంతుల, సీతారాం, వరుగు భాస్కరరెడ్డి, వాడ్రేవు వీరలక్ష్మి, మంగేష్, వెంకటకృష్ణ, శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

యువ కవుల ప్రోత్సాహానికి సహకారం

యువ కవులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్థానిక భీమ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన యువకవి పెనుమాక రత్నాకర్ రచించిన రెండో కథా సంపుటి గౌతమీ నదీ తీరాన.. అనే పుస్తక ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ స్థాయి కథల పోటీలో రత్నాకర్ రచించిన కథను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకూ ఆయన 60 కథలు, 5 నవలలు, 30 కవితలు రాయడం ఆయన సాహిత్యాభిలాషకు నిదర్శనమని ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు అన్నారు. అనంతరం గౌతమీ నదీ తీరాన పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. కలైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి, ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ప్రముఖ కవులు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, అవధానుల మణిబాబు, రత్నాజయ్ తదితరులు పాల్గొన్నారు.

కవి బీవీవీకి సత్కారం

అమలాపురం టౌన్: ఫ్రెంచి యానాం కవి సంధ్య మాసపత్రిక స్వర్ణోత్సవాల సందర్భంగా యానాంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అమలాపురానికి చెందిన కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణకు ఘన సత్కారం జరిగింది. స్వర్ణోత్సవ వేడుకల్లో కవి బీవీవీ 'పంజరంలో శాంతి కపోతం' అనే కవితను వినిపించి కార్యక్రమంలో పాల్గొన్న కవులతో అభినందనలు అందుకున్నారు. అనంతరం కవి బీవీవీని కవి సంధ్య పత్రిక ప్రతినిధులు, కవులు, రచయితలు చేతుల మీదుగా ఈ సత్కారం జరిగింది.

కేసులు మళ్లీ విచారణ చేయాలి

అమలాపురం రూరల్: దళితులపై జరిగిన హత్య కేసులు మళ్లీ విచారణ చేసి పూర్తి న్యాయం చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త డాక్టర్ బూసి వెంక్రటావు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐక్యవేదిక రాష్ట్ర కోకన్వీనర్ రేవు తిరుపతిరావు అధ్యక్షతన అమలాపురం ఈదరపల్లి అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. నాయకులు ఓంకార్, ప్రసాద్, జిల్లా దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, కొంకి రాజమణి, దుర్గారావు, నాగబత్తుల ప్రసాద్, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి కుటుంబానికి పరామర్శ

తాళ్లరేవు: ఇటీవల నీలపల్లి గ్రామానికి చెందిన గురుస్వామి మేర్నీడి సత్తిబాబు మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్తిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, చోడిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

అంబాజీపేట: స్థానిక శ్రీనివాస్ నగర్‌లో వేంచేసిన విజయబేతాళ స్వామి ఆలయం వద్ద స్థానిక కమిటీ సభ్యులు ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవంలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని భక్తులు, స్థానికులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, 13 పాలాల యువకులు, పెద్దల సహకారంతో ఘనంగా నిర్వహించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట, మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ సభ్యులు, 13 పాలాల పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బాణసంచా దుకాణాలపై చర్యలు



జి.వేమవరంలో బాణసంచా తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: దీపావళి పండగను పురస్కరించుకుని అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ హెచ్చరించారు. ఆదివారం కోరంగి ఎస్సై పి.సత్యనారాయణతో కలిసి ఆయన జి.వేమవరం గ్రామంలోని పార్వతీ పరమేశ్వర ఫైర్ వర్క్స్ యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ బాణసంచా తయారీదారులు, విక్రయదారులు విధిగా అనుమతులు పొందాలన్నారు. అనుమతుల్లేకుండా, నిబంధనలు పాటించకుండా దుకాణాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా బాణసంచాను నిల్వ చేయడం కూడా చట్ట విరుద్ధమని, ఎక్కడైనా బాణసంచా నిల్వలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

రసవత్తరంగా పుదుచ్చేరి రాజకీయాలు

యానాం: తమిళ నటుడు విజయ్ తమిళగ వెట్రి కజగం (టీవీకే) రాజకీయ పార్టీని స్థాపించి ఆదివారం విల్లుపురం వద్ద నిర్వహించిన మొదటి రాష్ట్ర సదస్సు ప్రత్యక్ష ప్రసారాన్ని టెలివిజన్‌లో సీఎం రంగసామి ఆసక్తిగా తిలకించడం చర్చనీయాంశమైంది. 2021లో గెలిచి సీఎంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మరో 15 నెలల్లో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే బీజేపీతో కలసి తాను స్థాపించిన నమదురాజ్యం కాంగ్రెస్ (ఎన్ఆర్ కాంగ్రెస్)తో పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో సీఎం రంగసామి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకారం లభించకపోవడం, కూటమిపై కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు బహిరంగ విమర్శలు, ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇప్పటివరకు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని రంగసామి కలవకుండా అంటీ ముట్టనట్లు వ్యవహరించడం కనిపించింది. 30 అసెంబ్లీ స్థానాలకు గాను 28 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైథిలింగానికి అనూహ్యంగా ఆ ఎన్నికలో మెజారిటీ రావడం తదితర పరిణామాల నేపథ్యంలో ఇక తాను బీజేపీతో కలిసి వెళ్తే వచ్చే ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నిక ఫలితమే పునరావృతమవుతుందని ఓటమి తప్పదని భావించి ప్రాంతీయ తమిళ పార్టీలతో వెళ్లాలనే ఆలోచనలో సీఎం ఉన్నారని చెబుతున్నారు. ఇటీవల టీవీకే పార్టీతో పొత్తుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు వేచిచూద్దాం అని ఆయన జవాబు ఇవ్వడం పలు అనుమానాలను రేపుతోంది.